# జ్ఞానోదయం

నేను కథల్రాయటం మానేశాను - నేను ప్రసిద్ధ రచయితని ; ఆంధ్ర దేశంలో అగ్రగణ్యులైన కథకుల్లో ఒకణ్ణి. నాకథ అచ్చువెయ్యని తెలుగు పత్రిక లేదు;తెలుగులోనే కాదు - హిందీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, తమిళం, కన్నడం, మళయాళం మొదలైన ఇతర భాషల పత్రికల్లో కూడా నా కథల అనువాదాలు అచ్చయినాయి. ఇంగ్లీసులో సరేసరి. దేశ విదేశాల్లోని అనేకానేక ఆంగ్ల పత్రికల్లో నా కథ లొచ్చాయి ఈ మధ్యనే ఒక దొచ్చి - సంస్కృతం, పైశాచికం, ఇత్యాది భాషల్లో కూడా మీ కథలు అనువదించి అచ్చేసుకుంటాను, అనుమతి కావాలన్నాడు - ఇచ్చాను. అనేక మార్లు అనేక పోటీల్లో నా కథలకి బహుమతులొచ్చాయి. ప్రారంభ సంచికల్లో ప్రత్యేక సంచికల్లో నా కథ వెయ్యని పత్రిక లేదు.

నేనిప్పటిదాకా అధమ పక్షాన అయిదొందల కథలు రాశాను. దేశమంతటా వేల సంఖ్యలో లక్షల సంఖ్యలో నాకు అభిమానులున్నారు. కొత్త కథఅచ్చయినప్పుడల్లా నా అభిమానులు చాలమంది నాకు ఉత్తరాలు రాస్తారు. పత్రికల్లో వచ్చే ప్రశంసలకి అంతే వుండదు.

'మీరసలు తెలుగు వాళ్ళయి పుట్టారుగాని, ఏ అమెరికాలోనో పుట్టివుంటే మీకీ పాటికి నోబెల్ ప్రయిజొచ్చేది సార్' అంటూ వుంటారు నా అభిమానులు కొందరు !

ఈ విధంగా కథకుడిగా నాకున్న ప్రతిభ గురించీ ప్రసిద్ధి గురించీ చెప్పాలంటే ఎంతయినా చెప్పొచ్చు. అసలు చెప్పక్కర్లేదు - ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. ఇప్పుడు

కొత్తగా చెప్పాల్సిన విషయమొక్కటే - నేను కథల్రాయటం మానేశాను ! ఈ సంగతి యింకా చాలా మందికి తెలీదు ఈ సంగతి తెలిసినప్పుడు పాఠక లోకంలో పత్రికా ప్రపంచంలో పెద్ద అలజడి కలుగుతుంది నాకు తెలుసు, పాఠకులు బెంగెట్టు కుంటారు,పత్రికల వాళ్ళు బెంబేలు పడిపోతారు ,అభిమానులు నిరుత్సాహ పడతారు, నిరాహార దీక్షలు ప్రారంభించినా అందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు

ఇదంతా తెలిసికూడా - నేను కథల్రాయటం మానేశాను

కథల్రాయటానికి పెద్ద కారణాలేమీ వుండవు, కాని రాయటం మానెయ్యటానికి తప్పని సరిగా కారణాలుంటాయి, కథలు ే ౹కోసం రాస్తారు డబ్బుకోసం రాస్తారు ఆత్మతృప్తికోసం రాస్తారు, అవసరం ౯ ద్దీ రాస్తారు, అలవాటుకొద్దీ రాస్తారు, సాహిత్యాన్ని బాగుచేయ్యటానికి రాస్తారు, సమాజాన్ని ఉద్ధరించటానికి రాస్తారు ఇంకేమీ చాతకాక రాస్తారు; ఇంకా ఇలాంటివే మరికొన్ని కారణాలవల్ల రాస్తారు

నేనూ ఇలాంటి కారణాలవల్లే ఇన్నాళ్ళూ కథల్రాశాను కాని ఇప్పుడు రాయటం మానెయ్యటానికి ఇంకా పెద్ద కారణముంది, అందుకో చిన్న కథ వుంది

నేను కథల్రాయటం మొదలెట్టిన తొలి రోజుల్లోనే నా ప్రతిభా సామర్థ్యాలవల్ల పాఠకుల్ని ఆకర్షించాను, ఆకట్టుకున్నాను ఆ తర్వాత మరింక ఆగలేదు శరపరంపరగా పుంఖాను పుంఖంగా కథల్రాశాను అతి స్వల్ప కాలంలోనే అగ్రశ్రేణి రచయితనైపోయాను పాఠకుల్ని ఆకర్షించటానికీ, అలరించటానికీ ఎలాంటి కథల్రాయాలో నేను తెలుసుకున్నాను రాసిన కథలన్నీ అచ్చుకావటానికి ఎలాంటి మార్గాలు అనుసరించాలో కూడాతెలుసుకున్నాను - అది వేరే కథ రకరకాల కథల్రాశాను ఒకే కథ ఎన్నో రకాలుగా రాశాను అబ్బాయి అమ్మాయిల ప్రేమ కథలు, పెళ్ళికథలు, ప్రేమించుకున్నా పెళ్ళికాని కథలు పెళ్ళి అవుతుందో లేదో చివరిదాకా తెలీని కథలు, అసలు వాళ్ళు ప్రేమించుకుంటున్నారో లేదో తెలీని కథలు, అపార్థాలకు ఆహుతైపోయిన అమర ప్రేమికుల కథలు, విచిత్ర మనస్తత్వాల విశిష్టకథలు, ఇలాఅన్నిరకాల కథలూ రాసి అన్నింటా అవునని పించుకున్నాను కొన్నింటిలో నాకు నేను సాటి అనిపించుకున్నాను

కాని - ఇన్ని వందల కథలు రాసినా ఇన్ని వేల మంది చేత, లక్షల మంది చేత శెభాసనిపించుకున్నాకూడా - చంద్రుడిలో మచ్చలాగా నాకొక చిన్న అపకీర్తి వుండిపోయింది ఈయన ఎన్నికథలు రాసినా ఎన్ని రకాల కథలు రాసినా కూడా - వాటిలో సమాజం కనబడదు, సమకాలీన సమస్యలు కనబడవు , వాస్తవ చిత్రణ వుండదు - అంటూ కొందరు నన్ను తిట్టడం ప్రారంభించారు ఈమధ్య ఇలాంటివాళ్ళు మరీ ఎక్కువయిపోతున్నారు

కొన్నాళ్ళు ఇలాంటివిమర్శలేవీ నేను పట్టించుకోలేదు. వెయ్యి మంది నన్ను వేనోళ్ళ పొగుడుతుంటే - ఎవడో ఒకడు మూల నిలబడి అరిస్తే మాత్రం నాకేమిటని వూరుకున్నాను. కాని వాళ్ళు నన్నొదిలిపెట్టలేదు, అసలీయన రాసేదంతా నిష్ప్రయోజనం; నిరర్థకం, దేశంలో కోట్లాది ప్రజలు ఆకలితో, అనేక సమస్యలతో అలమటిస్తోంటే ఇలాంటి వెర్రి మొర్రి కథలు రాసే వాడు అసలు రచయితేకాదు - అంటూ ఒకడీ మధ్య ఒక ప్రముఖ పత్రికలో నన్ను విమర్శించాడు. దాంతో ఇక నేను సహించలేక పోయాను.ఆకలి కథలూ, అడుక్కుతినేవాళ్ళ కథలూ నాలుగు రాసి వీళ్ళ మొహాన కొడితే తప్ప లాభం లేదనుకున్నాను. అలాంటి కథలుకూడా అవలీలగా నేను రాయగలనని నిరూపించదల్చుకున్నాను.

వస్తు నిర్ణయం జరిగిన తర్వాత కూడా సంఘటనలూ సన్నివేశాలూ సరిగ్గా వూహించుకునేదాకా నేను కథ రాయను. మామూలు కథలయితే మంచి మంచి వూహలొస్తాయి -మంచినీళ్ళ ప్రాయంగా రాసి పారేస్తాను. కాని ఇట్లా ఏ ఆకలి కథో రాయాలంటే ఎన్నాళ్ళకీ అంతుక్కావలసిన ముడి సరుకే దొరకలేదు, అసలు కథ ఎలా ప్రారంభించాలో ఎలా నడపాలో, ఎలా ముగించాలో తెలీలేదు.

ఇది కాదు వరసనుకుని - ఒకనాడు పనిగట్టుకుని ముష్టివాళ్ళ వెంట, మురికి పేటల వెంట తిరగటం ప్రారంభించాను.

ఆకలంటే ఏమిటో ఆ వేళ తెలిసింది నాకు, దరిద్రమంటే ఏమిటో ఆ వేళ చూశాను.

ఒక్క అన్నపు ముద్ద కోసం, పాచిపోయిన ఒక్క రొట్టె ముక్క కోసం, కుళ్ళిపోయిన ఒక్క పండుకోసం అలమటించటం చూశాను; ఆక్రోశించటం చూశాను; అడుక్కుతినటం చూశాను. పారేసిన విస్తరాకులకోసం - మనుషులు పందుల్లా, పశువుల్లా, కుక్కల్లా కాట్లాడు కోవటం చూశాను.

తల దాచుకోవటానికి పేవ్ మెంట్లు తప్ప, వీధి అరుగులు తప్ప ఇంకేమీ లేనివాళ్ళని చూశాను. వాళ్ళు కప్పుకోటానికి గోచి పాతలు తప్ప ఇంకేమీ లేనివాళ్ళని చూశాను. కడుపులో ఆకలి తప్ప, ఆవేదన తప్ప ఇంకేమీ లేని వాళ్ళని చూశాను.

రోజంతా కష్టపడినా గుప్పెడు మెతుకులు దొరకని కూలిపనులు చేసే వాళ్ళు;రోజంతా అమ్మినా రూపాయి మిగలని వ్యాపారాలు చేసే వాళ్ళు; ఏమీ చెయ్యలేక,చెయ్యిచాపి అడుక్కోటానికి కూడా శక్తి లేక అడుగంటిన శరీరాలతో శవాల్లా పడివున్నవాళ్ళ - ఇలాంటి వాళ్ళందర్నీ చూశాను!

ఆకలి విశ్వరూపం దాల్చటం చూశాను; దరిద్రం విలయతాండవం చెయ్యటం చూశాను.

ఆ రాత్రి నాకు అన్నం సయించలేదు; నిద్రపట్టలేదు; కన్ను మూస్తే ఆకలి కేకలు, ఆర్తనాదాలూ వినబడుతున్నాయి; కన్ను తెరిస్తే కన్నీటి సముద్రాలు కనబడుతున్నాయి.

కలం పట్టుకుంటే చెయ్యగడగడా వణుకుతోంది; తెల్లటి కాగితం నల్లగా మారి నన్ను వెక్కిరిస్తోంది.

ఇంకేమి రాయను ?

భారత దేశం బంగరు భూమి అనీ, ఆంధ్రదేశం అన్నపూర్ణ అనీ ఇంకెలా రాయను ? ఎయిర్ కండిషన్డు గదుల గురించీ, ఫోమ్ రబ్బరు పరుపుల గురించీ, కలలో కనబడ్డ అందగత్తె గురించీ, వెన్నెల వేడి గురించీ, మల్లెపూల పరిమళం గురించీ ఇంకెలా రాయను?

అందుకే - నేను కథలు రాయటం మానేశాను. ●

*(పుస్తక ప్రపంచం- మే 1978)*